క్లుప్తంగా

చీరల పంపిణీ



పాలకుర్తి టౌన్: నియోజకవర్గ మహిళలకు ఎమ్మెల్యే యశస్విని, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీ రెడ్డి పంపించిన చీరలను బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బైరు భార్గవ్, బొబ్బాల రమణారెడ్డి, ప్రశాంతి, బొలగాని స్వర్ణ, గుగ్గిళ్ల ఆదినారాయణ, కమ్మగాని నాగయ్య, మాదాసి హరీశ్ పాల్గొన్నారు.

కుట్టు మిషన్ల అందజేత



తరిగొప్పుల: ఆర్‌జేఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండంలోని పేద మహిళలకు ఉనర్వూ వృద్ధాశ్రమం ఆవరణలో సోమవారం కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. కేఎం జాన్, జయమని జాన్ ముఖ్యఅతిథులుగా పాల్గొని మహిళలఎ కుట్టు మిషన్లు అందజేశారు. ఈ సందర్భంగా జాన్ మాట్లాడుతూ తరిగొప్పుల వెల్ఫేర్ సొసైటీ ద్వారా గ్రామాల్లోని పేద మహిళలకు గత మూడు నెలలుగా కుట్టుశిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఆర్‌జేఎస్ ఫౌండేషన్ సభ్యులు ఎలాన్ మేరి ముద్దమల్లె సహకారంతో కుట్టు మిషన్లు పంపిణీ చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఒక్కొక్క గ్రూపులో 22 మందికి కుట్టు మిషన్లు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో తెలుగు బాప్టిస్ట్ చర్చ్ పాస్టర్ పీటర్, చర్చి అధ్యక్షుడు ఖాతా దేవాదానం, దామెర జీవరత్నం పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్ష కేంద్రం సందర్శన



జఫర్‌గఢ్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య సీఐ సూర్యప్రకాష్, స్థానిక ఎస్సై మహేందర్‌తో కలిసి సోమవారం సందర్శించి పరిశీలించారు. ఈ నెల 28 నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పరీక్ష కేంద్రంలో చేపట్టిన ఏర్పాట్లపై కళాశాల అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఇంటర్ పరీక్షల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక పోలీస్ సిబ్బందికి సూచించారు. పరీక్ష సమయంలో కేంద్రం వద్ద 144 సెక్షన్‌ను విధించనున్నట్లు ఆయన తెలిపారు. పోలీస్ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు ఉన్నారు.

హరితహారం మొక్కల దగ్ధం



తరిగొప్పుల: హరితహారంలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలు దగ్ధమయ్యాయి. మండల కేంద్రం నుంచి జనగామకు వెళ్లే ప్రధాన రహదారి వెంబడి రోడ్డుకు ఇరువైపులా నాటిన హరితహారం మొక్కలు సమీప పంట పొలాల్లోని పత్తి కొయ్యలకు గుర్తుతెలియని రైతు నిప్పు పెట్టడంతో మంటలు వ్యాపించి దగ్ధమయ్యాయి. క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ కరువైందని, మొక్కలు కాపాడాల్సిన బాధ్యత వారిపై ఉందని స్థానికులు అంటున్నారు. వాటి స్థానంలో మరొక మొక్కలు నాటాలని కోరుతున్నారు. పత్తి కొయ్యలు కాల్చడం వల్ల కలిగే అనార్థాలపై రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించాలని పలువురు కోరారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడి మృతి

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని సముద్రాల గ్రామానికి చెందిన పెద్దరబోయిన వెంకటయ్య (75) ఐదురోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు రాజు అందించిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సముద్రాల గ్రామానికి చెందిన వెంకటయ్య ఈనెల 22న ఉదయం మండలంలోని రంగరాయగూడెం సమ్మక్క–సారలమ్మ జాతర వద్దకు తన టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై బయలుదేరాడు. జాతర సమీపాన ఎర్రగట్టమ్మ గుడి వద్దకు వెళ్లేసరికి బీపీ అధికమై వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడ్డాడు. దాంతో అతడి తలకు, కాళ్లకు గాయాలయ్యాయి. అక్కడే ఉన్న సముద్రాలకు చెందిన కట్ల అఖిల్ తదితరులకు మాకు ఫోన్ ద్వారా సమాచారం అందించగా వెంటనే చేరుకుని గాయపడిన వెంకటయ్యను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. కాగా, చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడని తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ముస్క రాజు చెప్పారు.

అండర్ బ్రిడ్జిలతో ప్రమాదాల నివారణ



ఛాగల్లులో అండర్‌బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి తదితరులు

స్టేషన్‌ఘన్‌పూర్: రైల్వే ట్రాక్‌ల వద్ద రోడ్డు అండర్ బ్రిడ్జిల నిర్మాణం ప్రమాదాల నివారణకు దోహదపడుతుందని జెడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి అన్నారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా కేంద్రం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న రైల్వే రోడ్డు ఓవర్ , అండర్ బ్రిడ్జిల నిర్మాణంలో భాగంగా మండలంలోని ఛాగల్లు, రాఘవాపూర్ గ్రామాల్లోని రైల్వేగేట్‌ల వద్ద అండర్‌బ్రిడ్జీల నిర్మాణానికి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధాని నరేంద్రమోదీ సోమవారం వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఛాగల్లులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జెడ్పీ చైర్‌పర్సన్ హాజరై మాట్లాడారు. రైల్వేట్రాక్‌ల వద్ద అండర్‌బ్రిడ్జిల నిర్మాణంలో ఇప్పటికే జాప్యం జరిగిందని, ఎట్టకేలకు శంకుస్థాపనలు చేయడం సంతోషకరమన్నారు. పనుల్లో జాప్యం లేకుండా నాణ్యతాప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఎస్‌సీఆర్ అడిషనల్ ఇంజనీరింగ్ మేనేజర్ శ్రీనివాస్, రైల్వే అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ ఎం.రామకృష్ణరాజు మాట్లాడుతూ రైల్వేట్రాక్‌ల వద్ద అండర్‌బ్రిడ్జీల నిర్మాణంతో అవాంతరాలు లేని రైళ్లు, వాహనాల రాకపోకలు ఉంటాయన్నారు. గత పదేళ్లుగా భారతీయ రైల్వే మౌలిక సదుపాయాల కల్పనలో భారీ పరివర్తన దిశగా పురోగమిస్తుందని, సరికొత్త భారతదేశానికి సరికొత్త రైల్వే నినాదంతో దూసుకుపోతుందన్నారు. అమృత్‌భారత్ స్టేషన్ పథకంతో 554 రైల్వేస్టేషన్ల పునరాభివృద్ధి, 1,500 రోడ్డు ఓవర్, అండర్ బ్రిడ్జిలను రూ.41 వేల కోట్లతో నిర్మిస్తుందన్నారు. తెలంగాణలో 15 స్టేషన్ల పునరాభివృద్ధి చేస్తున్నారని, రైల్వేట్రాక్‌ల వద్ద స్థానికులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన మార్గాల ఏర్పాటు, అంతరాయం లేని ట్రాఫిక్ తదితర సౌకర్యాలను కల్పిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఛాగల్లు ఎంపీటీసీ కనకం స్వరూపగణేష్, కమర్షియల్ సూపరింటెండెంట్ సిన్హా, సీనియర్ సెక్షన్ ఇంజనీర్ గట్టు కుమారస్వామి, సత్యరావు, గణేష్‌కుమార్, తిరుపతిరావు, శ్రీనివాస్, బత్తుల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటా..



జఫర్‌గఢ్: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీహరి

జఫర్‌గఢ్: బాధిత కుటుంబాలకు అన్ని విధాల అండగా ఉంటానని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని జఫర్‌గఢ్ గ్రామ శివారు వడ్డెగూడెంలో అనారోగ్యంతో మృతి చెందిన సూదనబోయిన కొమురయ్య కుటుంబాన్ని ఎమ్మెల్యే పార్టీ బృందంతో కలిసి సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆర్థిక సాయం అందజేశారు. అలాగే తీగారం గ్రామ శివారు లింబానాయక్‌తండాలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి మృతి చెందిన గుగులోత్ పవన్‌నాయక్ కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యురాలు ఇల్లందుల బేబి శ్రీనివాస్, సింగిల్ విండో చైర్మన్ తీగల కర్నాకర్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు బానోత్ రాజేష్‌నాయక్, కుల్లా మోహన్‌రావు, ఎంపీటీసీలు జ్యోతి రజిత యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ..

చిల్పూరు: కృష్ణాజీగూడెంలో బుస్స వెంకటయ్య (80), గుండెల్లి వెంకటయ్య(60), పల్లగుట్టలో కటికనేని రామారావు(90) అనారోగ్యంతో మృతి చెందారు. కాగా, బాధిత కుటుంబాల ఇంటికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట నాయకులు ఎంపీటీసీ సాదం నర్సింహులు, పొట్లపల్లి శ్రీధర్‌రావు, కుంచాల సంపత్‌రాజు, వెంకట్రాజం, జీడి ఆనందం, డాక్టర్ సుదాకర్, శ్రీపతిరావు, వెంకట్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, కర్ర మల్లారెడ్డి, పుట్ట రవీందర్‌రెడ్డి, జక్కుల రాజయ్య తదితరులు ఉన్నారు.

ఇందిరానగర్‌లో..

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ శివారు ఇందిరానగర్‌కు చెందిన చింత ఐలయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా, ఎమ్మెల్యే కడియం శ్రీహరి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఐలయ్య మృతికి ప్రగాఢ సంతాపం తెలిపారు. చింతకుంట్ల నరేందర్‌రెడ్డి, ఎంపీటీసీ గన్ను నర్సింహులు, నాయకులు గాండ్ల రాజు, స్వామినాయక్, భాస్కుల సమ్మయ్య, నీల సోమన్న, రేండ్ల సోమయ్య ఉన్నారు.

పరీక్ష సామగ్రి అందజేత



పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సేవాలాల్ విద్యార్థి సేనా ఆధ్వర్యాన పరీక్ష సామగ్రిని సోమవారం అందజేశారు. హెచ్‌ఎం శోభ, సేనా జిల్లా అధ్యక్షుడు శంకర్ నాయక్, కార్యదర్శి అనిల్‌చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

మహాత్మా హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో..

మహాత్మా హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో మండలంలోని పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేసినట్లు సొసైటీ వ్యవస్థాపకుడు, ఎంవీఐ గంటా రవీందర్ సోమవారం తెలిపారు.

కలప ట్రాక్టర్ పట్టివేత

తరిగొప్పుల: అనుమతులు లేకుండా కలపను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై అయ్యల శ్వేత తెలిపారు. ఆదివారం సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఎన్యానాయక్‌తండా వద్ద నర్మెట మండలానికి చెందిన నక్క శ్రీకాంత్ ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ట్రాక్టర్‌లో వేప కలపను తరలిస్తుండగా పట్టుబడినట్లు చెప్పారు. 4 టన్నుల వేప కలపతో పాటు ట్రాక్టర్‌ను సీజ్ చేసి సోమవారం సంబంధిత అటవీశాఖ అధికారులకు అప్పగించడం జరిగిందని తెలిపారు. రాజు, నాయక్, అంజయ్య పాల్గొన్నారు.

లింగంపల్లి జాతర హుండీ ఆదాయం రూ.7 లక్షలు



హుండీలను లెక్కిస్తున్న సిబ్బంది

చిల్పూరు: మండలంలోని లింగంపల్లిలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మక్క–సారలమ్మ మినీ మేడారం జాతరకు సంబంధించిన హుండీల ద్వారా రూ. 7లక్షల 500 ఆదాయం వచ్చినట్లు ఈఓ చిందం వంశీ తెలిపారు. సోమవారం లింగంపల్లిలోని రైతు వేదికలో ఈఓ, నల్లగొండ దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సుమతి, రాజేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ వెంకన్న, ధర్మకర్తలు రామనాథం, గాలి రాజు, ఎడ్ల యాదయ్య, రంగు సురేష్ కండ్లకోలు బాలరాజు ఆధ్వర్యంలో హుండీల లెక్కింపును నిర్వహించగా ఎస్సై వినయ్‌కుమార్, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. కాగా, నోట్లకు అంటుకున్న బెల్లం, కుంకుమ, పసుపు వల్ల డబ్బులను శుభ్రం చేశాక లెక్కించి వివరాలు తెలుపుతామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కంకటి రవి, గంగుల సంపత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఏదునూరి రవీందర్, అపరాదపు రాజు, మోతె శ్రీను, కొయ్యడ సత్తయ్య, రచ్చ రవీందర్, రజనీకాంత్, తుత్తరు రాజు, గాజుల రజని, కందుకూరి రాజు, నరేందర్‌గౌడ్, కంకటి రాజన్న పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

బాలవికాస డైరెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే



పాలకుర్తి: నియోజకవర్గంలో తాగు నీటి సమస్య పరిష్కారానికి సహకరించాలని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి.. బాలవికాస డైరక్టర్ శౌరెడ్డిని సోమవారం కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా శౌరెడ్డిని స్వచ్ఛంద సేవా కార్యక్రమాలను నియోజకవర్గంలో చేపట్టాలని కోరారు. ఈ విషయమై శౌరెడ్డి సానుకూలంగా స్పందించి అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారం కోసం వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం



జఫర్‌గఢ్: మండలంలోని ఓబులాపూర్, తిమ్మంపేట, మగ్దుం తండా గ్రామాల్లో జెడ్పీటీసీ ఇల్లందుల బేబి శ్రీనివాస్ నిధులతో ఏర్పాటు చేసిన హైమాక్స్ లైట్లను బేబి , సింగిల్ విండో చైర్మన్ తీగల కర్నాకర్‌రావుతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన నిధులు రూ.3 లక్షల 60 వేలతో గ్రామాల్లో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ కన్నెబోయిన కుమారస్వామి, మాజీ ఎంపీటీసీ దేవదాసు, గబ్బెట శివయ్య, సంతోష్ పాల్గొన్నారు.

సమయానికి బస్సు సర్వీసు నడిపించాలి

బచ్చన్నపేట: ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఇబ్బంది కలుగకుండా ఆర్టీసీ అధికారులు సమయానికి బస్సు సర్వీసులు నడిపించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కిసాన్ కోఆర్డినేటర్ జంగిటి నరేష్ కోరారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. రెండ్రోజుల్లో ఇంటర్ వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయని, మండలంలోని పలు కళాశాల విద్యార్థులకు పరీక్షా కేంద్రాలు జిల్లా కేంద్రంలో పడ్డాయని తెలిపారు. ఉదయం 9 గంటలకు పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు ఉండాలి కావున అందుకు అనుగుణంగా ఆర్టీసీ అధికారులు బస్సులను నడిపించాలని కోరారు. బస్సులను డ్రైవర్, కండక్టర్లు ఆపకుండా వెళ్తున్నారని, పరీక్షల సమయంలో ప్రతి బస్సును ఆపేలా, సమయానుకూలంగా బస్సు సర్వీసులను నడిపించేలా ఆర్టీసీ అధికారులు చూడాలని విజ్ఞప్తి చేశారు.

స్వయంపాలన దినోత్సవం

చిల్పూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు సోమవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. హెచ్‌ఎంగా భువనకృతి, ఎంఎన్‌ఓగా శ్రీకాంత్, డీఈఓగా హాసిని వ్యవహరించారు. హెచ్‌ఎం దాసి శ్రవణ్‌కుమార్, వెంకటేశ్వర్లు, జుబేదా, వేణు, అనిత తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలి

బచ్చన్నపేట: వేసవి కాలంలో మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని మిషన్ భగీరథ డీఈలు అనిల్‌కుమార్, వేణుగోపాల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామాల ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించిందన్నారు. గ్రామాల్లో ప్రతి వార్డుపై అవగాహన పెంచుకొని ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. ఎంపీడీఓ రఘురామకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

సత్కారం



దేవరుప్పుల: ప్రైవేట్ అధ్యాపక వృత్తిలో కొనసాగుతూ ప్రవృత్తిగా సామాజిక కవి, రచయితగా రాణిస్తున్న మండల కేంద్రానికి చెందిన అంకాల సోమయ్యకు కవులు, కళాకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఘనసత్కారం లభించింది. జిల్లా కేంద్రంలో ఐక్యవేదిక, స్వేచ్ఛ పబ్లికేషన్స్, జేఏస్కే ట్యూషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వేదిక ప్రతినిధులు జీ.కృష్ణ, సాయికిరణ్, జరసం అధ్యక్షుడు సోమనర్సింహాచారీ, గౌరవ సలహాదారు పొట్టబత్తిని భాస్కర్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నట్టు సోమయ్య తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

జనగామ రూరల్: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో పట్టణానికి చెందిన ఎం.సత్యనారాయణకు 5రోజుల జైలు శిక్ష , మండలంలోని వెంకిర్యాలకు చెందిన ఈ.అనిల్‌కు రెండు రోజులు కోర్టు సోమవారం జైలు శిక్ష విధించింది. ఈ మేరకు సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ వెంకటరామనర్సయ్య శిక్ష ఖరారు చేసినట్టు పోలీసులు తెలిపారు.

ఈజీఎస్ కూలీల సంఖ్య పెంచాలి



కూలీలతో మాట్లాడుతున్న ఏపీడీ

చిల్పూరు: ఉపాధి హామీ పనులకు వచ్చే కూలీల సంఖ్యను పెంచడంలో పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అడిషనల్ డీఆర్‌డీఓ, ఏపీడీ చంద్ర శేఖర్ అన్నారు. మండలంలోని దేశాయితండా, చిల్పూరు గ్రామాల్లో ఈజీఎస్ ద్వారా కూలీలు చేస్తున్న పనులను సోమవారం ఏపీడీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఊర చెరువు వద్ద పనిచేస్తున్న కూలీలతో మాట్లాడారు. కొలతల ప్రకారం పనులు చేయాలని సూచించారు. ఇకపై నర్సరీ నిర్వహణపై దృష్టి సారించాలని, టార్గెట్ ప్రకారం మొక్కలకు ప్రతీ రోజు రెండు సార్లు నీరు పోయించాలని కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందికి చెప్పారు. ఎంపీడీఓ బర్మావత్ శంకర్‌నాయక్, ఎంపీఓ మధుసూదన్, ఉపాధిహామీ ఏపీఓ మోహన్‌రావు, ఈసీ సింగపురం కిరణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'కేంద్రం' విధానాలను తిప్పికొట్టాలి



మాట్లాడుతున్న ఎండీ అబ్బాస్

జనగామ రూరల్: పోరాడే సంస్థలు, కమ్యూనిస్టులపై దుష్ప్రచారం చేస్తున్న కేంద్రప్రభుత్వ విధానాలు తిప్పికొట్టాలని, ప్రజాపోరాటాలకు ప్రజలను సిద్ధం చేయడమే సీపీఎం లక్ష్యమని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండీ అబ్బాస్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అధ్యక్షతన విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతులు మద్దతు ధర అడిగితే కాల్పులకు పాల్పడడం దారుణమన్నారు. కేంద్రం అవలంబిస్తున్న విధానాలను ప్రజలు గమనిస్తున్నారని, రానున్న ఎంపీ ఎన్నికల్లో బీజేపీని ఓడించి తగిన గుణపాఠం చేబుతారని అన్నారు. సమావేశంలో నాయకులు రాపర్తి రాజు, యాదగిరి, అహల్య, రాజు, రమేష్, సోమన్న, గోపి, జోగు ప్రకాష్, విజేందర్,ఉపేందర్, నరేందర్, షబానా, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి



మహాసభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు

రఘునాథపల్లి: యాదగిరిగుట్టలో మంగళవారం నిర్వహించే ప్రజారోగ్య, వైద్య ఉద్యోగుల సంఘం (ఐఎన్‌టీయూసీ 3194) రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఏసిరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో సంఘం నాయకులతో కలిసి ఆయన మహాసభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్ర మహాసభకు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరు కానున్నారని, జిల్లాలోని ఐఎన్‌టీయూసీ సభ్యులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా మహాసభ కార్యక్రమంలో మండల వైద్యాధికారి కమలహాసన్‌కు వారు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ట్రెజరర్ బిక్కునాయక్, పాండారి, ఈసీ ఏఎస్ఎం రాష్ట్ర నాయకురాలు రాజ్యలక్ష్మి, సభ్యులు రత్నకుమారి, ఝాన్సిరాణి, అన్నపూర్ణ, స్రవంతి, అయోధ్య తదితరులు పాల్గొన్నారు.

నీటి వసతి కల్పించాలని వినతి

లింగాలఘణపురం: మండల కేంద్రంలోని వీరన్నగుట్ట వద్ద శివరాత్రి ఉత్సవాలు సమీపిస్తున్న నేపథ్యంలో నీటి వసతి కల్పించాలని కోరుతూ ఆలయ కమిటీ అధ్యక్షుడు బండ్రు సత్తయ్య ఆధ్వర్యంలో సోమవారం ఎంపీఓ, గ్రామస్పెషల్ ఆఫీసర్ మల్లికార్జున్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కు వినతి పత్రం అందజేశారు. శివరాత్రి పర్వదినం రోజున వీరన్నగుట్ట వద్దకు పరిసరాలను పరిశుభ్రం చేయాలని కోరారు. ఎంపీటీసీ భిక్షపతి, మాజీ సర్పంచ్ సాయిమల్లయ్య, కమిటీ సభ్యులు వెంకటేశ్, శ్రీనువాసు, నాగరాజు, జంపయ్య, రాంచందర్ తదితరులు ఉన్నారు.

సంకల్పయాత్రను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న దశమంతరెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్: భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యాన చేపట్టిన విజయ సంకల్పయాత్రను జయప్రదం చేసేలా పార్టీ శ్రేణులు కంకణబద్ధులై పనిచేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి అన్నారు. విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేసేలా డివిజన్ కేంద్రంలో పార్టీ మండలశాఖ ఆధ్వర్యంలో పదాధికారులతో సన్నాహక సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. కిషన్‌రెడ్డి చేపట్టిన విజయ సంకల్ప యాత్ర మార్చి 1న స్టేషన్‌ఘన్‌పూర్‌కు వస్తుందని, పార్టీ శ్రేణులు, అనుబంధ సంఘాల బాధ్యులు, యువత, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు. పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జ్ మురళీధర్‌గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ గుండె విజయరామారావు, కృష్ణప్రసాద్, రామ్మోహన్‌రెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, తుమ్మల మురళీధర్‌రెడ్డి, మండలశాఖ అధ్యక్షుడు సట్ల వెంకటరమణగౌడ్, నాయకులు ఐనుగాల యుగేందర్‌రెడ్డి, ఐలోని అంజిరెడ్డి పాల్గొన్నారు.

పాలకుర్తి : విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని జిల్లా పార్లమెంట్ ప్రభారీ వి.మురళీధర్ గౌడ్ కోరారు. మండల కేంద్రంలో నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్ అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ విజయరామారావు, జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగ రాంమోహన్ రెడ్డి, రిటైర్డు డీజీపీ కృష్ణప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి కర్ర శ్రీనివాస్ రెడ్డి, సొడ రమేష్, సుంకరనేని కోటేశ్వర్, మండల అధ్యక్షుడు దుంపల సంపత్, శంకర్, రంగు రాములు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యవర్గాల ఎన్నిక



వంగ దశరథ

దేవరుప్పుల: మండలంలోని చిన్నమడూరు కాంగ్రెస్ పార్టీ గ్రామ నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా సీనియర్ నాయకుడు వంగ దశరథ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి తెలిపారు. సోమవారం గ్రామంలో డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి ఆదేశాల మేరకు నూతన కార్యవర్గం ఎన్నిక సమావేశం నిర్వహించారు. ఉపాధ్యక్షులుగా నాగులపెల్లి సోమయ్య, మేడ నర్సయ్య, అనగాని రాజు, ప్రధాన కార్యదర్శులుగా రాంపెల్లి పరమేశ్, మడికొండ కుమార్, కోశాధికారిగా నారాయణదాసు ఆంజనేయులు, కార్యదర్శిగా జనగాం బాలరాజు, యూత్ విభాగం అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా మొగుళ్ళ హరీష్, మధు, మడికొండ ప్రణయ్, ప్రధాన కార్యదర్శులుగా శరత్, రాకేశ్, కోశాధికారిగా రాంపెళ్ళి మహేష్,కార్యదర్శిగా పెద్దిరాజు, మహిళా విభాగం అధ్యక్ష, ఉపాధ్యక్షురాలుగా వాసర్ల వీరమ్మ, పరీదుల శ్రీలత ఎన్నికయ్యారు.

చర్యలు తీసుకోవాలి



బచ్చన్నపేట: మండలంలోని బసిరెడ్డిపల్లిలో నిర్వహిస్తున్న స్టోన్ క్రషర్‌పై చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు, రైతులు కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలో తహసీల్దార్ విశాలాక్షి, ఎస్సై కంకల సతీష్, మైనింగ్ అధికారులకు సోమవారం వినతి పత్రాలను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ క్రషర్‌లో నిబంధనలకు విరుద్ధంగా భారీ యంత్రాలతో స్టోన్‌లను పగులగొడుతుంటే పెద్ద శబ్దాలు వస్తున్నాయని, ఎస్సీ కాలనీలో పలు ఇళ్లు భారీ శబ్దాలకు ధ్వంసం అవుతున్నాయని అన్నారు. అలాగే దుమ్మూధూళితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులు నల్ల మల్లయ్య, కిష్టయ్య, లక్ష్మయ్య, సిద్దిమల్లయ్య, పోశయ్య, రాములు, సిద్దులు పాల్గొన్నారు.

కనులపండువగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

కొడకండ్ల: మండలంలోని లక్ష్మక్కపల్లిలో సీతారామాంజనేయ స్వామి ఆలయంలో సోమవారం సీతారాముల కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. ఆలయంలో జరుగుతున్న అధ్యయన భక్తోత్సవాల్లో భాగంగా ఉదయం మహాహోమం, పూర్ణాహూతి హోమాలు చేపట్టిన అనంతరం వేద పండితులు సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పుస్కూరి మోహన్‌రావు దంపతులతో పాటు భక్తులు పాల్గొన్నారు.

'ప్రేరణ'కు హాజరు కావాలి

బచ్చన్నపేట: మండలంలోని అన్ని పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు నేడు (మంగళవారం) ప్రేరణ కార్యక్రమం ఉంటుందని.. తప్పక హాజరు కావాలని మండల నోడల్ అధికారి డీవీఎల్ఎన్ మూర్తి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సౌజన్యంతో ప్రేరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మండలంలోని కొడవటూర్ రోడ్డులోని శ్రీనిధి గార్డెన్‌లో ఎస్ఎస్‌సీ వార్షిక పరీక్షలు–2024పై అవగాహన, ప్రేరణ కార్యక్రమం ఉంటుందన్నారు. విద్యార్థులు మెటీరియల్ తీసుకొని ఉదయం 9 గంటలకు హాజరయ్యేలా హెచ్‌ఎంలు చూడాలని చెప్పారు. మధ్యాహ్న భోజనంతో పాటు ఎగ్జామినేషన్ కిట్లను అందించడం జరుగుతుందన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలి

దేవరుప్పుల: వేసవిలో ఊరూరా తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ లక్ష్మీనారాయణ సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా వికారాబాద్ నుంచి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఇక్కడ విధుల్లో చేరిన లక్ష్మీనారాయణను ఎంపీఓ టి.సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామ కార్యదర్శులు ఘనంగా సన్మానించారు. అనంతరం మండలంలోని ఆయా గ్రామాల్లో వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా మిషన్ భగీరథ నిర్వహణలో లోపాలు తలెత్తకుండా ప్రత్యేకాధికారులతో సమన్వయం చేసుకుంటూ చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు. కార్యక్రమంలో ఎంపీఓ సురేష్‌కుమార్, సూపరింటెండెంట్ ఉమామహేశ్వర్, ఎస్ఆర్ మల్లీశ్వర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మానస, పంచాయతీ కార్యదర్శుల సంఘం ప్రతినిధులు పాండు, అమరేందర్, జిలుకర వెంకన్న, అనిల్, శ్వేత, వాణిశ్రీ, సంతోషి, కల్యాణి పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని తానేదార్‌పల్లి గ్రామానికి చెందిన బీజేపీ నియోజవకర్గ కన్వీనర్ ఐలోని అంజిరెడ్డిపై గుగులోత్ మధునాయక్ చేసిన ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగరాజు తెలిపారు. మధునాయక్ ఫిర్యాదు మేరకు ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గత నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో చిల్పూరు మండలం ఫత్తేపూర్‌కు చెందిన గుగులోత్ మధునాయక్ తన టవేరా వెహికిల్‌ను అంజిరెడ్డికి నెల రోజులు రూ.1.30లక్షలకు కిరాయికి ఇచ్చాడు. ఎన్నికలు ముగిసినా సదరు కిరాయి డబ్బులు ఇంతవరకూ ఇవ్వలేదని, ఎప్పుడు అడిగినా రేపు, మాపు అంటూ కాలయాపన చేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. కాగా, సోమవారం స్థానిక సిరిపురం గార్డెన్స్‌లో బీజేపీ విజయ సంకల్పయాత్ర సన్నాహక సమావేశం జరుగగా మీటింగ్ అనంతరం అంజిరెడ్డిని సదరు డబ్బులను మధునాయక్ అడిగాడు. దీంతో పార్టీ కార్యకర్తల ముందు కిరాయి డబ్బులు అడుగుతావా అంటూ కులం పేరుతో దూషిస్తూ బూతులు తిట్టాడని, నీకు డబ్బులు ఇచ్చేది ఎక్కడిదని తనను, తల్లి రంగమ్మను కూడా దూషించాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. మధునాయక్ ఫిర్యాదు మేరకు అంజిరెడ్డిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.